క్లుప్తంగా

ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల అసోసియేషన్ స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండల కమిటీల అధ్యక్షులు బుయ్య గట్టయ్య, పేరాల చంద్రమౌళి ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ వైద్యులు బుధవారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని, ఎంపీ డాక్టర్ కడియం కావ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి వారి సమస్యలను తీసుకెళ్లారు. కార్యక్రమంలో పుల్లెంగుల కుమారస్వామి, వేముల వెంకటేశ్వర్లు, పొన్న రవీందర్, దినేష్, బీరయ్య, ఉమాశంకర్, విద్యాసాగర్, సదానందం, సంపత్‌రెడ్డి, శ్రీను, రమేష్, సాంబయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'పల్లా'ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ మారపాక రవి ఆధ్వర్యంలో ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. మాచర్ల గణేష్, చల్లా చందర్‌రెడ్డి, కుమార్, మహేందర్‌రెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.

ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథ్‌ను కలిసిన మండల నాయకులు

దేవరుప్పుల: హైదరాబాద్‌లో తలపెట్టిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారానికి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి పర్యవేక్షణలో మండల నాయకులు బుధవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రజాభవన్‌లో ఏఐసీసీ సెక్రటరీ పెరమండ్ల విశ్వనాథ్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎమ్మెల్యే పల్లా ప్రత్యేక పూజలు



జనగామ: జనగామ పట్టణంలోని గణేష్ స్ట్రీట్ శ్రీవిఘ్నేశ్వర ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా, నిర్వాహకులు సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జనగామ ప్రజలు సుఖశాంతులతో ఉండాలన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం రూ.లక్ష విరాళం అందజేశారు. భక్తులకు మరింత సౌకర్యంగా ఉండే విధంగా సదుపాయాలను కల్పించాలన్నారు.

పత్తి రైతు ప్రయోజనాలు దెబ్బతీస్తున్న కేంద్రం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: పత్తి రైతు ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ రాజేష్‌రెడ్డికి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి దిగుమతిపై విధించే 11 శాతం సుంకం రద్దు ఉత్తర్వును వెంటనే కేంద్రం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధరను వెంటనే ప్రకటించాలన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య, రాయపురం భిక్షపతి, యాట రాజు, సాంబరాజు పాల్గొన్నారు.

జనగామ రూరల్: ముడి పత్తిపై 11 శాతం దిగుమతి సుంకం రద్దు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో దిగుమతి సుంకాన్ని రద్దు చేయాలని జనగామ తహసీల్దార్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఉర్సుల కుమార్, మంగ బీరయ్య, బానోత్ జితేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు'

చిల్పూరు: విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి దోషులుగా నిలబడవద్దని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. లింగంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై హెచ్‌ఎం సముద్రాల శ్రీదేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు శంకరాచారి, ప్రసన్నకుమార్, భిక్షపతి, రాంబాబు, సమత, ఫాతిమా, సోమయ్య, శివకుమార్ సిబ్బంది వెంకట్, దమయంతి పాల్గొన్నారు.

జనగామ: సాయినగర్‌లో డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



జనగామ: 18వ వార్డు వాసవీకాలనీ ఫేజ్-2లో పుష్పార్చనలో మహిళలు



దేవరుప్పుల: హోమం పూజలో బీఆర్‌ఎస్ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ దంపతులు



గణనాథుడికి ప్రత్యేక పూజలు

సాక్షి నెట్‌వర్క్: గణపతి నవరాత్రోత్సవాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో కొలువుదీరిన గణనాథుడికి బుధవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో కుంకుమార్చనలు, అన్నప్రసాద వితరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నర్మెట: అన్నప్రసాద వితరణలో పాల్గొన్న భక్తులు



జఫర్‌గఢ్: హోమం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



బచ్చన్నపేటలో..



చిల్పూరు: వెంకటాద్రిపేటలో ..



పాలకుర్తి: దర్దేపల్లిలో అన్నదానం నిర్వహిస్తున్న యూత్ సభ్యులు



పాలకుర్తి టౌన్: ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో..



జనగామ: గోపూజ చేస్తున్న భక్తులు



పాలకుర్తి టౌన్: శాంతినగర్‌లో..

ప్రమాదకరంగా గుంతలు

రఘునాథపల్లి: వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిలోని నిడిగొండ రైల్వే బ్రిడ్జిపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడినా నిర్మాణ సంస్థకు పట్టడం లేదు. నిత్యం వీఐపీలు, వేలాది వాహనాలు ప్రయాణించే హైవేపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగకముందే భారత జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు తక్షణమే స్పందించి గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు

అలరించిన వినాయక విజయం నాటకం

రఘునాథపల్లి: మండలంలోని బానాజీపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం నాల్గవ తరగతి విద్యార్థులు వినాయక విజయం నాటక ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. శివపార్వతులుగా శాన్విక, ప్రణవి, వినాయక కుమారస్వాములుగా అభిజ్ఞ, సాయి రిత్వికలు, నారదుడిగా రిశ్వాంకు నటించారు. విద్యార్థుల నాటక ప్రదర్శనకు కృషి చేసిన ఉపాధ్యాయుడు నిమ్మ జయపాల్‌రెడ్డిని అభినందించారు. హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నాటక ప్రదర్శన చేసిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బాధిత కుటుంబానికి సాయం

జనగామ రూరల్: పెంబర్తికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త గోనెల బొందులు ఇటీవల మృతి చెందాడు. కాగా, బొందులు పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పెంబర్తి కార్యకర్తలు, నాయకుల ఆర్థికసహకారంతో బుధవారం బాధిత కుటుంబానికి రూ.లక్ష 38 వేల సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, చిన్నబోయిన నర్సయ్య, పాషం రాజిరెడ్డి, మంద లక్ష్మణ్, చిన్నబొయిన రాజు, కంత్రి ప్రేమ్‌సాగర్, నాయకులు ఉన్నారు.



సాయం అందజేస్తున్న నాయకులు

విద్యాభివృద్ధికి మహేందర్ సేవలు ఆదర్శనీయం



మహేందర్-సునీత దంపతులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రఘునాథపల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సిద్ధి మహేందర్–సునీత దంపతులు అందిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఖిలాషాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆలేటి యాదవరెడ్డి అన్నారు. పాఠశాల రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ 2.50 లక్షలు, 20 బెంచీలకు రూ .లక్ష కలిపి మొత్తం 3.50 లక్షల సొంత డబ్బు అందించిన మహేందర్ దంపతులకు బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం ఆత్మీయ అభినందన సభ నిర్వహించి శాలువాలతో సత్కరించారు. తండ్రి సిద్ధి వీరేశం జ్ఞాపకార్థం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్న మహేందర్ సేవలు ప్రశంసనీయమన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం భారత రవీందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కంచనపల్లి పీఏసీఎస్‌లో నిధుల దుర్వినియోగం

● పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

రఘునాథపల్లి: మండలంలోని మరో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. సంఘం మాజీ కార్యదర్శి రూ.78.82 దుర్వినియోగం చేసినట్లు విచారణలో నిర్ధారణ అయ్యింది. దీంతో అవినీతికి పాల్పడి సస్పెండ్ అయిన సీఈఓ వంగ శ్రీనివాస్‌పై కోఆపరేటివ్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ నీలం కొర్నెలియస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు డీసీఓ కోదండరాములు బుధవారం తెలిపారు. మండలంలోని కంచనపల్లి పీఏసీఎస్‌లో వంగ శ్రీనివాస్ కార్యదర్శిగా పని చేశాడు. సంఘంలో ఆర్థిక అవకతవకలపై ఫిర్యాదు నేపథ్యంలో జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ వేణుగోపాల్ విచారణలో ఓచర్స్ లేకుండా రూ.27.76 లక్షలు, ఎరువుల బకాయిలు రూ.10.10 లక్షలు, సన్‌డ్రై డెట్ టర్స్ రూ.3.65 లక్షలు, బ్యాంకు నుంచి అనామతు డబ్బులు రూ .17.25 లక్షలు, సెంట్రల్ బ్యాంక్ నుంచి అక్రమంగా రూ.19.80 లక్షలు తీసుకున్నట్లు గుర్తించారు. అక్రమాలకు పాల్పడిన శ్రీనివాస్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్‌తో పాటు సహకార సంఘం మాజీ చైర్మన్ చీమలపాటి రవీందర్ కూడా డబ్బులు డ్రా చేసేందుకు సర్ చార్జ్ ఆర్డర్ ఇచ్చినట్లు విచారణలో తేలింది.

బ్యాంకు సేవలపై అవగాహన పెంపొందించుకోవాలి

జనగామ రూరల్: విద్యార్థులు బ్యాంకు సేవలపై అవగాహన పెంపొందించుకోవాలని పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ బానోత్ సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం చౌడారంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌లో పీఎన్‌బీ ఆధ్వర్యంలో బ్యాంకు లావాదేవీలు, సేవింగ్ అకౌంట్, డెబిట్, క్రెడిట్ కార్డులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.సుధీర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఆదరాభిమానాలే వృత్తి నిబద్ధతకు నిదర్శనం



మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

లింగాలఘణపురం: పదవీ విరమణ సమయంలో విద్యార్థులు, పూర్వవిద్యార్థులు చూపిన ఆదరాభిమానాలే వృత్తి నిబద్ధతకు నిదర్శనమని ఎంఈఓ విష్ణుమూర్తి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విద్యారాణి అధ్యక్షతన మారోజు మల్లికార్జున్ పదవీ విరమణ అభినందన సభ ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. హెడ్మాస్టర్ మల్లికార్జున్ విధులు నిర్వహించిన వివిధ మండలాల నుంచి పూర్వవిద్యార్థులు రావడం ఆయన పనితీరుకు నిదర్శనమన్నారు. అనంతరం ఉపాధ్యాయసంఘాల ప్రతినిధులు, పూర్వవిద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఏసీజీ రవికుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి, టీఆర్‌టీయు నాయకుడు రమేష్, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, హెడ్మాస్టర్ల సంఘం అధ్యక్షుడు చంద్రబాను, ఎస్సీ, ఎస్టీ సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య, బీసీ సంఘం అధ్యక్షుడు అంజయ్య పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీలనుంచి తొలగించే కుట్ర

● మాజీ మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ అనుబంధ సంఘం ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో తీజ్ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల నాయకుడు జరుపుల బాలునాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఉత్సవాల్లో దయాకర్‌రావు మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి సంప్రదాయలను కాపాడుకోడంలో తీజ్ వేడుకలు స్ఫూర్తిదాయకమన్నారు. బీఎస్‌ఎస్ నాయకులు పల్ల సుందర్‌రామిరెడ్డి, పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, యాకుబ్ నాయక్, తీజ్ ఉత్సవ నిర్వహకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధం

జనగామ రూరల్: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం రాజ్యాంగ విరుద్ధమని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్, గిరిజన సంఘం నాయకులు మాజీ కౌన్సిలర్ మూడ్ లక్ష్మణ్ నాయక్, అజ్మీరా స్వామి నాయక్, వాంకుడోత్ అనితలు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన గిరిజన సంఘాల నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీ సోయం బాబురావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుల తీరుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరి ప్రకటించి వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బాలాజీ నాయక్, భూక్యా వాసు నాయక్, బానోత హరిలాల్ నాయక్, లకావత్ లాల్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తిటౌన్: మాట్లాడుతున్న దయాకర్‌రావు

లంబాడీ సమాజం తగిన బుద్ధి చెబుతుంది

లింగాలఘణపురం: లంబాడీలను కించపరిచిన వారికి బంజారా–లంబాడీ సమాజం తగిన బుద్ధి చెబుతుందని సేవాలాల్ సీనియర్ నాయకులు భూక్యా నర్సింహ్మ, దరావత్ గణపతి అన్నారు. బుధవారం దేవరకుంట తండాలో సేవాలాల్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్ ఆధ్వర్యంలో లంబాడీ బంజారా నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లంబాడీ బంజారాల పోరాటంతో 108వ సవరణ చట్టంతో రిజర్వేషన్లు అమలులోనికి వచ్చాయని, రిజర్వేషన్లు ఎత్తివేయాలని సుప్రీం కోర్టులో పిటీషన్ వేయడం రాజ్యాంగ విరుద్ధమని, తెల్లం వెంకట్రావ్, సోయం బాబురావులను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. రాజు, సీతారామ్, మోతిరామ్, బిక్షపతి, మల్లేశ్, శంకర్, నరేందర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

రఘునాథపల్లి: భవన నిర్మాణ రంగాల కార్మికుల సంక్షేమం కోసం రూ.10 లక్షల బీమా పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి బుధవారం మండల కేంద్రంలో సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య, జిల్లా అధ్యక్షుడు తూడి అంజయ్య, మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, పోకల శ్రీనివాస్, రాజు, జోజి, యాదగిరి, యాకస్వామి, స్వామి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎంతో బోధన సులభతరం

జఫర్‌గఢ్: విద్యార్థులకు టీఎల్‌ఎంతో బోధన సులభతరమవుతుందని మండల విద్యాశాఖ అధికారి రఘునందన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి టీఎల్‌ఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు బోధనాభ్యసన సామగ్రిని ప్రదర్శించారు. అనంతరం హెచ్‌ఎం పద్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడారు.

సేవాదృక్పథం అలవర్చుకోవాలి

జనగామ రూరల్: విద్యార్థులు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో చేరి సేవాదృక్పథం అలవర్చుకోవాలని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.భవాని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

చిల్పూరు: మల్కాపూర్ గ్రామానికి చెందిన బోగం లావణ్య ఇటీవల హైదరాబాద్‌లో ఇండియన్ బ్యూటీ అసోసియేషన్ ద్వారా మహానంది అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామ మహిళా సంఘం నాయకురాలు మాదం శెట్టి కనుకతార ఆధ్వర్యంలో వినాయక మండపంలో అర్చకులు చొల్లేటి రాజేశ్వరశర్మ వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజల అనంతరం లావణ్యను ఘనంగా సన్మానించారు.

ఎన్నిక




బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ నాగిరెడ్డిపల్లి గ్రామ అధ్యక్షుడిగా ఇరుగు ప్రకాశ్‌ను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాలమేరకు పార్టీ కార్యకర్తలు, నాయకులు బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



బచ్చన్నపేట: టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా నారాయణపురం గ్రామానికి చెందిన జంగిటి నరేష్‌కుమార్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నగరిగారి ప్రీతం నియామక పత్రాన్ని నరేష్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆరే ప్రశాంత్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీడీఓగా మమతాబాయ్



బచ్చన్నపేట: మండల నూతన ఎంపీడీఓగా మమతాబాయ్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా మండలంలో ఎంపీడీఓ లేకపోవడంతో ఎంపీఓ వెంకటమల్లికార్జున్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం నుంచి బదిలీపై వచ్చిన మమతాబాయ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓను పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

జనగామ రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ యశ్వంతాపూర్ గ్రామ కార్యకర్త గొర్రెంకాల సంపత్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే మరిగడిలోని ఇట్టబోయిన శ్రీనివాస్‌తల్లి, చీటకోడూర్ గ్రామానికి చెందిన బోల్ల అంజయ్య కుమారుడు రమేష్ మృతి చెందగా బాధిత పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మేకల కళింగ రాజు, మాజీ మార్కెట్ చైర్మన్ సిద్దిలిగం, గండి ప్రవీణ్, బోళ్ల సంపత్, గద్దం నాగేష్, బాల్నే శీను, బొట్ల అమృతం గద్దం నరేష్, పుట్ట ఈశ్వర్ ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి..

రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన జనగామ విద్యుత్ లైన్‌మన్ (ఎల్‌ఎం) బిర్రు మహేందర్ సతీమణి శోభారాణి ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న టీఆర్‌వీకేఎస్ హెచ్-58 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జాన్సన్ బుధవారం సంఘం నాయకులతో కలిసి రఘునాథపల్లికి చేరుకొని సమతీణిని కోల్పోయిన మహేందర్‌ను పరామర్శించారు. యూనియన్ నేతలు అక్బర్, వేణుగోపాలరావు, నాగరాజు, ఉపేందర్, వెంకటయ్య, మహేందర్, ప్రసాద్ , శ్రీనివాస్ ఉన్నారు.

నివాళి

పాలకుర్తి: గూడూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు, వైద్యుడు వైట్ల భిక్షపతి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బుధవారం కాంగ్రెస్ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యానారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మార్కెట్ మాజీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాఘవరావు, గుగ్గిళ్ల ఆదినారాయణ, బెల్లి దేవేందర్, చిక్కుడు శ్రీనివాస్‌లు ఉన్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించడమే ధ్యేయం

కొడకండ్ల: జనాభా ప్రకారం బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు రవీందర్, భిక్షపతి, నాగరాజు, యాకేష్‌యాదవ్, మదుసూధన్, యాకయ్య, ఈదయ్య, సతీష్‌గౌడ్, రాగ్యానాయక్, రాంకోటి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల విధుల బహిష్కరణ

పాలకుర్తి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమకు 5 నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని ఫీల్డ్ అసిస్టెంట్లు అన్నారు. బుధవారం వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఫీల్డ అసిస్టెంట్లు విధులు బహిష్కరించి ఎంపీడీఓ రవీందర్‌కు వినతి పత్రం అంజేశారు.

గుంతల పూడ్చివేత

చిల్పూరు: రాజవరంలో వ్యవసాయ పొలాలతో పాటు తాటి వనానికి వెళ్లే రెండు కిలోమీటర్ల మట్టి రోడ్డు వర్షాలకు గుంతలమయంగా మారింది. కాగా, బుధవారం గ్రామస్తులు ఎడ్ల మహిపాల్, ఇరుగు రమేష్, ఎడ్ల యాదగిరి, ఇల్లందుల వెంకటస్వామి, రంగు రవి, బైరగోని మల్లయ్య, ఎడ్ల శ్రీను, రత్నాకర్, ఎల్లయ్యలు ముందుకు వచ్చి మొరం తెప్పించగా, మహిపాల్, వెంకటస్వామి, యాదగిరి, రమేష్‌లు గుంతలు పూడ్చివేశారు.

మూడు కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ

కొడకండ్ల: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులకు కేటాయించిన మూడు కేంద్రాల ద్వారా గురువారం యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి తెలిపారు. ఆగ్రోస్‌లో 12 మెట్రిక్ టన్నుల యూరియాకు కొడకండ్ల, మొండ్రాయి, నర్సింగాపురం గ్రామాలకు ఏఈఓ నవ్య టోకెన్లు జారి చేసి, హాకా రైతు కేంద్రంలో 10 మెట్రిక్ టన్నుల యూరియా ఏడునూతుల, రంగాపురం, రేగుల గ్రామాలకు ఏఈఓ సరిత టోకెన్లు జారి చేసి, సొసైటీలో 15 మెట్రిక్ టన్నుల యూరియాకు పాకాల, రామవరం, లక్ష్మక్కపల్లి గ్రామాల రైతులకు ఏఈఓ ప్రియాంక టోకెన్లు జారి చేసి యూరియా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పాలకుల వివక్ష తగదు

దేవరుప్పుల: గ్రామీణాభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో నిత్యం సేవలు అందించే ఉద్యోగ, కార్మికుల పట్ల పాలవర్గాల వివక్ష తగదని జీపీఏఅండ్‌డబ్ల్యూ(సీఐటీయూ) జిల్లా కోశాధికారి బస్వ రామచంద్రుగౌడ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జీపీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసి ఎంపీడీఓ టి. సురేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

భూదాన్ భూములు దళితులకు పంపిణీ చేయండి



రఘునాథపల్లి: మండలంలోని మేకలగట్టులోని భూదాన్ భూములు దళితులకు పంపిణీ చేయాలని గ్రామ దళితులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఫణికిషోర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. తమ వినతికి తహసీల్దార్ సానుకూలంగా స్పందించారని దళితులు తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తా విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలల్లో 13 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. నాలుగు రౌండ్లలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో సిద్దార్థ విద్యాలయం ప్రథమ బహుమతి రూ.5,116, సుధా టెక్నో స్కూల్ ద్వితీయ బహుమతి రూ.3116, తృతీయ బహుమతి, ప్రగతి విద్యాలయం రూ.2116 నగదు బహుమతి గెలుచుకున్నాయి. విజేతలకు ఎంఈఓ పోతుగంటి నర్సయ్య బహుమతులు అందజేశారు.

సంతాపం

పాలకుర్తి టౌన్: మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన సామాజిక సేవ కార్యకర్త, ఆర్ఎంపీ వైద్యుడు వైట్ల లక్ష్మీపతి ఆకస్మిక మృతి తీరని లోటని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య, సాహితీ వేత్త డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ఎంతో మంది పేద విద్యార్థుల ఉతన్న చదువులు చదవడంలో ఆయన ప్రాత ఉందని అన్నారు. వైద్యుడు, ప్రజా హిత, సామాజిక నాయకుడు లక్ష్మీపతి జీవితాన్ని సార్థకం చేసుకున్నారన్నారు. మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్.. లక్ష్మీపతి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.